నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో యువతకు అందించే నైపుణ్య శిక్షణ తరగతులకు సంబంధించిన అంశాలపై ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే నిరుద్యోగ యువతకు ఎంపీ మల్లురవి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చామన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఒక్కో నియోజకవర్గ కేంద్రానికి ప్రత్యేకంగా రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 28, 29వ తేదీలలో జిల్లా కేంద్రంలోని గగ్గలపల్లిలోని తేజ కన్వెన్షన్ హాలులో కల్వకుర్తి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. సుమారు 200 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకర్లు కార్యక్రమానికి హాజరవుతారని వివరించారు. కల్వకుర్తి ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి చేయూత


చెక్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ గ్రామానికి చెందిన సులిగిరి ఊశమ్మ, వెంకటయ్య దంపతుల కుమార్తె ప్రహర్ష నారాయణపేట మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆర్థిక ఇబ్బందులతో కుమార్తెను చదివించలేకపోతున్నామని కుటుంబసభ్యులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. దీనికి మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి స్పందించి విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చాడు. ఈ మేరకు శుక్రవారం ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థిని ప్రహర్షకు ఎంబీబీఎస్ చదవడానికి మొదటి సంవత్సరం ఫీజు రూ.75 వేలు ఆర్థికసాయాన్ని హైదరాబాద్‌లోని తన స్వగృహంలో అందజేశారు.

క్లుప్తంగా

క్రమబద్ధీకరించని ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టొద్దు

అచ్చంపేటరూరల్: క్రమబద్ధీకరించని ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టొద్దని మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని ప్లాట్ల వద్ద సర్వే చేశారు. మండలంలోని లేఅవుట్, ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత గ్రామ పంచాయతీ యొక్క పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి ఈసీ, సేల్ డీడ్, అవసరమైన ఇతర డాక్యుమెంట్లు సమర్పించాలని సూచించారు. క్రమబద్ధీకరించని ప్లాట్లు, లేఅవుట్‌లలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదన్నారు. క్రమబద్ధీకరణకు ఈనెల చివరివరకు అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్‌ఐకి సన్మానం

ఉప్పునుంతల: మండలంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షుడు శ్రీధర్ మహరాజ్, ఉపాధ్యక్షుడు గణేష్ మహరాజ్, గ్రామ అధ్యక్షుడు శివప్రసాద్ మహరాజ్, వంశీ, వసీంబాబా, రమేష్, ఇస్మాయిల్ శివ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: హైదరాబాద్ మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం చేపట్టిన ధర్నాకు జిల్లా కేంద్రం నుంచి కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కనీస వేతనాలు లేక మున్సిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో కార్మికులు శేఖర్, కురుమయ్య, మహేష్, రమేష్, బాలరాజు, వెంకటయ్య, మహిళలు పాల్గొన్నారు.

కేసీ గుప్తాకు నివాళి

కల్వకుర్తిరూరల్: వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ వ్యవస్థాపకుడు చంద్రసేన్‌గుప్తా వర్ధంతిని శుక్రవారం పట్టణంలోని వాసవీ క్లబ్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కేసీ గుప్తా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు శిబిరే శ్రీనివాస్, ఆంజనేయులు, సత్యం, కృష్ణయ్య, శంకర్, నర్సింహులుగుప్తా పాల్గొన్నారు.

మాదిగలు అధికసంఖ్యలో తరలిరావాలి



చారకొండ: వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు మేరకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎస్సీ ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు సిరునాటి శ్రీనువాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30న జడ్చర్లలో నిర్వహించే సన్నాహక సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి ఎస్సీ కులాల్లో బేడ బుడగ జంగాలు, మాదిగలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, శ్రీను రామస్వామి, సైదులు కొండల్, రాములమ్మ ఉన్నారు.

కోడిపుంజుల వేలం



కొల్లాపూర్: ఇటీవల కోడేరు మండలంలో కోడి పందెంలలో పట్టుబడ్డ కోడిపుంజులను శుక్రవారం కొల్లాపూర్ కోర్టు ఆవరణలో వేలంపాట ద్వారా విక్రయించారు. జడ్జి జ్యోత్స్న గుంటి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం 12 కోడిపుంజులకు రూ.39,450 ఆదాయం వచ్చింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో జమచేయనున్నట్లు కోర్టు సూపరింటెండెంట్ భోగా హరికృష్ణ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఉప్పరి వెంకటయ్య రెండు రోజుల కిందట మృతిచెందాడు. శుక్రవారం బీజేపీ నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పట్టణంలోని వాసవీనగర్‌లో 15వ వార్డు కౌన్సిలర్ షానవత్‌ఖాన్ సోదరుడు ఫెరోజ్‌ఖాన్ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇంటికి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు శేఖర్‌రెడ్డి, నర్సింహ, బాబిదేవ్, గంగాధర్‌చారి తదితరులు ఉన్నారు.

మినీస్టేడియం అభివృద్ధికి కృషి


స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్ ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మినీ స్టేడియాన్ని పరిశీలించారు. అధునాతనంగా స్టేడియం తీర్చిదిద్దేందుకు రూ.13 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే భక్తమార్కండేయ శివాలయం సమీపంలో స్విమ్మింగ్‌పూల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్, నాయకులు గోపాల్‌రెడ్డి, చంద్రమోహన్, రఘురాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యానికి నిదర్శనం గ్యార్మీ

ఐకమత్యానికి నిదర్శనం గ్యార్మీ అని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గ్యార్మీ వేడుకలను ఆర్టీసీ ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కులమతాలకు అతీతంగా ఆర్టీసీ ఉద్యోగులు గ్యార్మీ నిర్వహించుకోవడం శుభపరిణామన్నారు. ఆర్టీసీ డీఎం మురళీ దుర్గాప్రసాద్, ఉద్యోగులు మోహన్‌లాల్, మోయిజ్, కరీముల్లా, నాజు, ఏజేరెడ్డి, ఏకేగౌడ్, నాగయ్య, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

సకాలంలో బియ్యం పంపిణీకి చర్యలు



పెద్దకొత్తపల్లి: సకాలంలో బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రేషన్ బియ్యం గోదాంను పరిశీలించారు. గోదాంలో ఉన్న బియ్యం స్టాక్ వివరాలను ఆయన పరిశీలించారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు డీలర్‌లు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. గోదాం నుంచి రేషన్ బియ్యాన్ని గ్రామాల్లో ఉన్న రేషన్ దుకాణాలకు సకాలంలో పంపించాలని తహసీల్దార్ మోహన్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల అభివృద్ధికి పాటుపడదాం



ఉప్పునుంతల: విద్యా ప్రమాణాల అభివృద్ధికి పాటుపడదామని ఎంఈఓ చంద్రశేఖర్ ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం మండలంలోని దేవదారికుంట తండా పాఠశాల, స్థానిక కేజీబీవీ పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. దేవదారికుంట తండా పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతిని ఎంఈఓ పరిశీలించారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఊర్కొండ: మండలంలోని ఊరుకొండ పేట అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో మాదుగుల గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి సహకారంతో రూ.లక్ష వ్యయంతో నిర్మించనున్న రేకుల షెడ్డు నిర్మాణానికి శుక్రవారం దేవాలయ అధికారులు, అర్చకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దాత సుధాకర్ రెడ్డి, దేవాలయ అధికారులు మారుతీ రావు, శ్రీశైలం, రవి, అర్చకులు దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్ శర్మ, మహేష్ శర్మ, శ్రీనివాస శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిలో ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారిలో వివరాలు నమోదు చేసుకున్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

తెలకపల్లి: కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ మల్లేష్, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

అచ్చంపేట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలులో విఫలం అయ్యిందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. అంతకుముందు పట్టణంలోని ప్రధాన రహదారిగుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్, సీఐటీయూ జిల్లా నాయకుడు రాములు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో 34 రోజులపాటు సమ్మె చేసినా... ఆ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, కార్మికులు వేమయ్య, బాలస్వామి, శ్రీను, గంగయ్య, పద్మమ్మ, పార్వతమ్మ, వెంకటేష్, హుస్సేనమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం



పెద్దకొత్తపల్లి: ధరణిలో ఉన్న భూసమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని కొల్లాపూర్ ఆర్డీఓ యాదగిరి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల గురించి తహసీల్దార్ మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ల నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



వెల్దండ: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని శంకరకొండతండా బూత్ అధ్యక్షుడు బాణావాత్ అరుణ్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం తండాలో పార్టీ సభ్యత్వ నమోదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే దేశ భద్రత సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు భుజంగం, శ్రీను, చిరంజీవి, నరేష్‌రాజ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

కల్వకుర్తిరూరల్: బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త చురుకుగా సభ్యత్వ నమోదులో పాల్గొనాలని సూచించారు. సీనియర్ నాయకుడు బండెల రాంచంద్రారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, నర్సింహ, సురేందర్‌గౌడ్, శేకర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, గంగాధరాచారి, బాబీదేవ్, వెంకటేష్‌యాదవ్, రాజశేకర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా పాకెట్ల పట్టివేత

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పాన్‌షాప్‌లో గుట్కాలు అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ రాంచందర్‌జీ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా పట్టణంలోని పాలమూరు చౌరస్తాలోని ఎస్ఆర్ పాన్‌షాప్‌లో గుట్కాలు అమ్ముతున్నారని పోలీసులు దాడులు చేశారు. పాన్‌షాప్‌లో రూ.2వేల విలువ గల గుట్కాలను పట్టుకొని పాన్‌షాప్ యజమాని అబ్దుల్ మిరాజ్‌పై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు.

సమస్య పరిష్కారం

చారకొండ: గోదాం నుంచి బియ్యం తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గురువారం తహసీల్దార్ సునీత దృష్టికి డీటీఎఫ్ నాయకులు తీసుకెళ్లారు. ఈ మేరకు ఆమె స్పందించి శుక్రవారం గోదాం రైస్ పాయింట్ అధికారి రఘుకు సమస్యను వివరించారు. సకాలంలో పాఠశాలలకు బియ్యం అందించాలని సూచించారు. దీనికి రైస్ పాయింట్ అధికారి రఘు సానుకూలంగా స్పందించి సకాలంలో బియ్యం పాఠశాలలకు చేరుస్తామని వివరించారు. దీంతో డీటీఎఫ్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు పోరాడుతాం



పెంట్లవెల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించేవరకు పోరాడుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. చాలీచాలని జీతాలతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, చిట్టెమ్మ, రామస్వామి, చిన్నమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాలల సత్తా చాటుదాం



అచ్చంపేట రూరల్: వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 27న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభలో మాలల సత్తా చాటుదామని మాల ఉద్యోగుల ఐక్యవేదిక అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు కల్ముల ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం అచ్చంపేటలో మాలమహానాడు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. హరిశ్చంద్ర, బాలస్వామి, మల్లికార్జున్, రవీందర్, శేఖర్, అంజి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మన్ననూర్: జిల్లా కేంద్రంలో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అచ్చంపేట డివిజన్ కార్యదర్శి బి. లింగం కోరారు. శుక్రవారం ఆయన మన్ననూర్ గ్రామంలో పోరాట సమితి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాయకులు దివాకర్, నీరంజన్, నరహరి, పర్వతాలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

కల్వకుర్తిరూరల్: మాలమహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 27న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణ రెడ్డి విడుదల చేశారు. రాష్ట్ర నాయకుడు సుధాకర్, శివశంకర్, బొజ్జయ్య, బాలస్వామి, రామకృష్ణ, కేశవులు, అనంతరాములు పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన ఏఓ

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లి, గోకారం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ శుక్రవారం పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తిపంటకు ఎర్రగుమ్మడి తెగుళ్లు ఆశించిందని గుర్తించారు. అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రావడం లేదని రైతులు వాపోయారు. ఎకరాకు 5 నుంచి 7 క్వింటాల లోపు దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం వరి పంటలను పరిశీలించారు. సిబ్బంది మహేశ్వరి, రైతులు ఉన్నారు.

వికలత్వం శాతం తగ్గించడంపై హర్షం

మన్ననూర్: వికలత్వం శాతం తగ్గించి ప్రోత్సహం అదించడంపై రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు ఆ సంఘం జిల్లా నాయకులు అంగో శంకర్, చారకొండ రామ్మోహన్, శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం చారకొండ రామ్మోహన్ మన్ననూర్ గ్రామం అంబేడ్కర్ కూడలిలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉన్న 75–90 శాతం వికలత్వాన్ని పరిగణలోకి తీసుకునేదని గుర్తు చేశారు. ప్రస్తుతం 40 శాతంకు తగ్గించి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందించే ప్రోత్సహకాలకు అర్హులను చేయడంతో ఎంతో మేలు చేకూరనుందన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూల శివారులో శుక్రవారం ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైనట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షానవాజ్‌ఖాన్, అనూప్‌శర్మలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దళితులకు అన్యాయం చేస్తే ఊరుకోం

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి, పాపగల్ గ్రామాల్లో దళితులకు న్యాయం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల దసరా ఉత్సవాల్లో దళితులపై దాడులు చేసిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు రాజీ కుదర్చడం అన్యాయం అన్నారు. అనంతరం దళిత బహుజన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంగారయ్య, కొత్ర బాలు, ప్రధాన కార్యదర్శిగా రాములు, సభ్యులుగా 21 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

అచ్చంపేట రూరల్: పట్టణంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గంగాపురం రాజేందర్‌ను శుక్రవారం హైకోర్టు న్యాయవాదులు సన్మానించారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ తెలంగాణ ఉద్యమంలో అవిశ్రాంతంగా రాజేందర్ పని చేశారు. సహచర న్యాయవాదికి భవిష్యత్తులో మరిన్ని పదవులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు, స్థానిక న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలని బేడబుడగ జంగాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కొడిగంటి నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో బేడ బుడగజంగాల నియోజకవర్గ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గ, మండల కమిటీలను వారు ఎంపిక చేశారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లబావి గ్రామానికి చెందిన చంద్రకళ (64) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, సీడీపీఓ లక్ష్మి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతురాలికి భర్త రామనాథం, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

ఆరోగ్యం బాగుచేస్తానని మోసం

నాగర్‌కర్నూల్ క్రైం: ఆరోగ్యం బాగుచేస్తానని నమ్మించి ఓ వ్యక్తి మోసం చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి నజ్మాబేగం టైలర్‌గా పని చేసుకుని జీవిస్తోంది. అనారోగ్యం ఉన్న వారికి అజ్మీర్ దర్గాలో బాగుచేస్తామని ఇన్‌స్టాగ్రామ్‌లో యాడ్ ఇచ్చారు. యాడ్‌లో ఉన్న ఫోన్‌నంబర్‌ను నజ్మాబేగం సంప్రదించి తన కూతురు ఆరోగ్యం సరిగ్గాలేదని బాగుచేయాలని కోరింది. సదరు వ్యక్తి మాయామాటలతో ఈ నెల7వ తేదీ నుంచి విడతల వారీగా రూ. 2 లక్షల 22 వేల నగదును కాజేశారు. దీంతో ఆమె మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ప్రచారం

బల్మూర్: రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ సర్పంచ్ శివశంకర్, ఉప సర్పంచ్ తిరుపతిలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీలో రూ.3.55 కోట్లు అవినీతి జరిగినట్లు కొందరు దురుద్దేశ్యంతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఇది ఏమాత్రం వాస్తవం కాదన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న సీసీఆర్ సంస్థపై పరువునష్టం దావా వేస్తామన్నారు. గ్రామ పంచాయతీకి 2013 నుంచి 2024 వరకు వివిధ శాఖల ద్వారా వచ్చిన నిధులు రూ.3.55కోట్లు కాగా వీటితో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలు, తాగునీటి పైపులైన్లు, రోడ్ల మరమ్మతు, వీధిలైట్లు, పారిశుధ్య పనులు, సిబ్బంది జీతాల చెల్లింపులు వంటి అభివృద్ధి పనులను అధికారుల పర్యవేక్షణలో పూర్తి పారదర్శకంగా చేపట్టామన్నారు. సీసీఆర్ సంస్థపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ఊర్కొండ: మండల కేంద్రంలోని హజ్రత్ ఖాజా సయ్యద్ యూసుఫోద్దీన్ దర్గా ఉత్సవాలు పీఠాధిపతి షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దర్గాకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. దర్గా పీఠాధిపతులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఈకేవైసీ నమోదులో నిర్లక్ష్యం వహించొద్దు


మాట్లాడుతున్న తహసీల్దార్ కార్తీక్‌కుమార్

వెల్దండ: రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ నమోదులో నిర్లక్ష్యం వహించొద్దని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ డీలర్లకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రేషన్‌దుకాణాల్లో కార్డులలోని సభ్యులందరితో ఈకేవేసీ నమోదు చేయించాలన్నారు. లబ్ధిదారులు ఈకేవైసీ చేస్తే రేషన్‌బియ్యం వస్తాయని వారు పేర్లు రికార్డులో నమోదు అవుతాయన్నారు. అదేవిధంగా డీలర్ల గ్రామాల్లో మరణించిన వారిని గుర్తించి రేషన్‌కార్డుల నుంచి వారి పేర్లను తొలగించాలన్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 80శాతం పూర్తి చేశారని మిగిలిన 20శాం పూర్తి చేసి జిల్లాలో ఈకేవైసీ పూర్తి చేసిన వారిలో మండలాన్ని మొదటిస్థానంలో ఉంచాలని సూచించారు. అనంతరం డీలర్లకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీను, ఆర్ఐలు, రేషన్‌డీలర్లు తదితరులు ఉన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, సయ్యద్, కార్తీక్, తరుణ్, సుల్తాన్, సుధాకర్, భగత్‌సింగ్, అంజి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.